

బిగ్ సి 21వ వార్షికోత్సవ ఆఫర్లను ఆవిష్కరిస్తున్న కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి, కంపెనీ డైరెక్టర్లు వై స్వప్న కుమార్, జీ బాలాజీ రెడ్డి, ఆర్.గౌతమ్ రెడ్డి

## బిగ్ 'సి' వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్, డిసెంబర్ 14: ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్ 'సి'..21వ వార్షికోత్సవ సంబురాలు జరుపుకుంటున్నది. ప్రతి పండుగ, ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని వినూత్న ఆఫర్లను ప్రకటించడం అనవాయితీగా వస్తున్నదని, ఈసారి మాత్రం మూడు సంచలనాత్మక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు కంపెనీ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసిన వారికి రూ.1.10 లక్షల వరకు హెల్త్‌కేర్ ప్రయోజనాలు పొందవచ్చునని చెప్పారు. ఈ ఆఫర్‌లో భాగంగా ఏడాది పాటు అపరిమిత టెలి ఫోనిక్ డాక్టర్ కన్సల్టేషన్, ప్రమాద బీమా కవరేజ్, మందులపై 20 శాతం వరకు రాయితీ, రూ.5 వేల వరకు అంబులెన్స్ సదుపాయం ఉచితంగా లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా అందిస్తున్న తొలి ఆఫర్ ఇదేనన్నారు. అలాగే రూ.75 వేల విలువైన పేటీఎం కూపన్లతో ఎంటర్‌టైన్‌మెంట్, డైనింగ్, ట్రావెలింగ్, వినియోగ వస్తువులు, వెల్‌నెస్, షాపింగ్‌కు సంబంధించిన ప్రయోజనాలు పొందవచ్చునని చెప్పారు. ఎంపిక చేసిన స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసిన వారికి రూ.2కే రూ.4,999 విలువైన ఫైర్‌బోల్ట్ స్మార్ట్ వాచ్ లేదా రూ.2,999 విలువైన రెడ్మీ బడ్స్‌ను సొంతం చేసుకోవచ్చును. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించవచ్చునని ఆయన పేర్కొన్నారు. గతేడాది రూ.950 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ర్టాల్లో 250కి పైగా రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది.

## ఆజాద్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, డిసెంబర్ 14: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న ఆజాద్ ఇంజినీరింగ్ ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.740 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి సెప్టెంబర్‌లో సెబీకి దరఖాస్తు చేసుకున్న సంస్థకు ఈ నెల 5న అనుమతినిచ్చినట్టు సంస్థ వెల్లడించింది. కంపెనీ సమర్పించిన డ్రాఫ్ట్ పేపర్ ప్రకారం ఫ్రెష్ ఇష్యూతో రూ.240 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) రూట్‌లో మరో రూ.500 కోట్లు సమీకరించాలని సంస్థ సంకల్పించింది. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన షేర్లను ఓఎఫ్‌ఎస్ రూట్‌లో విక్రయించనున్నారు. ఈ వాటా విక్రయంతో కంపెనీ ప్రమోటర్ రాకేశ్ చోప్దార్‌కు రూ.170 కోట్ల నిధులు సమకూరనుండగా, పిరమల్ స్ట్రక్చర్డ్ క్రెడిట్ ఫండ్‌కు రూ.280 కోట్లు, డీఎంఐ ఫైనాన్స్‌కు రూ.50 కోట్లు లభించనున్నాయి. ఈ ఐపీవో ద్వారా సేకరించిన నిధులను మూలధన వ్యయంతోపాటు రుణాలను చెల్లించడానికి, ఇతర అవసరాల నిమిత్తం వినియోగించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం సంస్థ ఏరోస్పేస్, రక్షణ, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీస్‌కు చెందిన పలు విడిభాగాలను తయారు చేసి విక్రయిస్తున్నది.



దేశీయ మార్కెట్లోకి సరికొత్త సోనెట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్న కియా ఎండీ, సీఈవో తే-జిన్ పార్క్. చిత్రంలో కంపెనీ ఉన్నతాధికారులు

# ఉరకలెత్తిన ఉత్సాహం

## దుమ్మురేపిన దేశీయ స్టాక్ మార్కెట్లు

### ఫెడ్ రిజర్వ్ కిక్కుతో ఆల్‌టైమ్ హైకి సూచీలు

### సెన్సెక్స్ 930 పాయింట్లు ఎగిసి 70,514 వద్దకు

### నిఫ్టీ 256 పాయింట్లు ఎగబాకి 21,183 వద్ద ముగింపు

### ఒక్కరోజే రూ.3.83 లక్షల కోట్లు ఎగిసిన మదుపరుల సంపద



ముంబై, డిసెంబర్ 14: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం రికార్డులతో హోరెత్తించాయి. తాజా ద్రవ్యసమీక్షలో అమెరికా రిజర్వ్ బ్యాంకైన ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడమేగాక, వచ్చే ఏడాది నుంచి రేట్ల కోతలు మొదలవుతాయని సంకేతాలివ్వడం మదుపరులను విపరీతంగా ఆకట్టుకున్నది. ఈ ఉత్సాహంతోనే ఉదయం మొదలు.. ట్రేడింగ్ ముగిసేదాకా ఇన్వెస్టర్లు కొనుగోళ్లతో రెచ్చిపోయారు. దీంతో అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సరికొత్త స్థాయిలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారి 70వేల ఎగువన, నిఫ్టీ మొదటిసారి 21వేల పైన ముగిశాయి. 929.60 పాయింట్లు లేదా 1.34 శాతం ఎగిసి సెన్సెక్స్ 70,514.20 పాయింట్ల ఆల్‌టైమ్ హై వద్ద నిలవగా, నిఫ్టీ 256.35 పాయింట్లు లేదా 1.23 శాతం ఎగబాకి 21,182.70 పాయింట్ల లైఫ్ టైమ్ హై వద్ద స్థిరపడింది. ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో పెరిగింది.

**అన్ని షేర్లూ పరుగులే..**

మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేయడంతో దాదాపు అన్ని రంగాల షేర్లూ లాభాలను అందుకోగలిగాయి. రియల్టీ షేర్లు అత్యధికంగా 3.80 శాతం పుంజుకోగా, ఐటీ 3.21 శాతం, టెక్నాలజీ 2.72 శాతం, టెలికం 2.14 శాతం, ఆర్థిక సేవలు 1.38 శాతం, చమురు, గ్యాస్ 1.36 శాతం, ఎనర్జీ 1.28 శాతం చొప్పున పెరిగాయి. షేర్లవారీగా.. టెక్‌మహీంద్రా, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడ్డాయి. ఇక బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 1.06 శాతం, స్మాల్‌క్యాప్ 0.62 శాతం చొప్పున పుంజుకున్నాయి.

**అంతర్జాతీయ మార్కెట్లలో..**

అంతర్జాతీయ మార్కెట్లను పరిశీలిస్తే.. ఆసియా దేశాల్లో ప్రధానమైన దక్షిణ కొరియా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. జపాన్, చైనా సూచీలు మాత్రం నష్టపోయాయి. ఐరోపాలోని బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ సూచీలుసహా అమెరికా మార్కెట్లూ లాభాల్లోనే ముగిశాయి. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌ఐఐ) భారతీయ మార్కెట్లలో పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే బుధవారం రూ.4,710.86 కోట్ల పెట్టుబడుల్ని తెచ్చినట్టు దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ వర్గాలు తెలిపాయి.

**రూ.355 లక్షల కోట్లకు..**

రికార్డుస్థాయి లాభాల నడుమ బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ మరో సరికొత్త శిఖరానికి చేరుకున్నది. ఇంతకుముందెప్పుడూ లేనట్టుగా రూ.355 లక్షల కోట్లను తాకింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.3.83 లక్షల కోట్లు పెరగడం గమనార్హం. స్టాక్ ఎక్స్ఛేంజ్ వివరాల ప్రకారం గురువారం రూ.3,83,006.92 కోట్లు ఎగిసి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడ్ అవుతున్న కంపెనీల మార్కెట్ విలువ రూ.3,55,02,238.83 కోట్ల (4.26 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

ఫెడ్ రిజర్వ్ నుంచి వడ్డీరేట్ల కోతల సంకేతాలు రావడం మార్కెట్ సెంటిమెంట్‌ను పెద్ద ఎత్తున బలపర్చింది. వచ్చే ఏడాది కనీసం మూడుసార్లు వడ్డీరేట్లను తగ్గిస్తామని ఫెడ్ చెప్పడం.. మదుపరులను పెట్టుబడుల దిశగా నడిపించింది. అమెరికా బాండ్ ఈల్డ్స్‌లో భారీ పతనం కూడా స్టాక్ మార్కెట్లపై ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచింది. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, రాబోయే ద్రవ్యసమీక్షల్లో ఆర్బీఐ రెపోరేటును దించుతుందన్న అంచనాలు పెరగడం, ఐటీ, రియల్టీ షేర్లు మదుపరులను అమితంగా ఆకట్టుకోవడం కూడా కలిసొచ్చింది.

*-వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్*

తాజా ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లను ఫెడ్ రిజర్వ్ యథాతథంగా ఉంచడం స్టాక్ మార్కెట్లను మెప్పించింది. భారత్‌సహా దాదాపుగా ఆసియా, ఐరోపా, అమెరికా మార్కెట్లన్నీ జోష్ మీదున్నాయి. అలాగే క్రూడాయిల్ రేట్లు పడిపోవడం, విదేశీ మదుపరులు పెట్టుబడులకు దిగడం దేశీయ స్టాక్ మార్కెట్లకు కలిసొచ్చిన అంశాలుగా చెప్పుకోవచ్చు. మున్ముందు దేశ జీడీపీ గణాంకాలు ఇంకా మెరుగుపడుతాయన్న ఆశలు, వచ్చే ద్రవ్యసమీక్షల్లో ఆర్బీఐ వడ్డీరేట్ల తగ్గింపులుంటాయన్న అంచనాలు లాభించాయి.

*-ప్రశాంత్ తాప్సీ, మెహతా ఈక్విటీస్*

### లాభాలకు ప్రధాన కారణాలు

- వడ్డీరేట్ల కోతకు ఫెడ్ రిజర్వ్ సంకేతాలు
- రెపోరేటును ఆర్బీఐ తగ్గిస్తుందన్న అంచనాలు
- భారీగా పెట్టుబడులతో ముందుకొచ్చిన విదేశీ మదుపరులు
- అంతర్జాతీయ మార్కెట్లలో దిగజారిన ముడి చమురు ధరలు
- గ్లోబల్ స్టాక్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- ఆకట్టుకున్న ఐటీ, టెక్నాలజీ, రియల్టీ షేర్లు

### ఇంట్రా-డే రికార్డులు

- ***మునుపెన్నడూ లేనివిధంగా ఒకానొక దశలో 70,602.89 పాయింట్లను తాకిన సెన్సెక్స్. ఈ సమయంలో సూచీ 1,018.29 పాయింట్లు లేదా 1.46 శాతం ఎగిసింది.***
- ***తొలిసారి 21,210.90 పాయింట్లను చేరిన నిఫ్టీ. ఈ దశలో 284.55 పాయింట్లు లేదా 1.35 శాతం ఎగబాకింది.***



## పసిడి జిగేల్




న్యూఢిల్లీ, డిసెంబర్ 14: బంగారం ధరలు భగ్గుమన్నాయి. వచ్చే ఏడాదిలో వడ్డీరేట్లను తగ్గించకతప్పదని ఫెడరల్ రిజర్వు ప్రకటించడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో ఒక్కసారిగా పుంజుకున్నాయి. దీంతో దేశీయ మార్కెట్లో బంగారం ధర రికార్డు స్థాయిలో పెరిగింది. గురువారం ఒకేరోజు తులం బంగారం రూ.1,130 అధికమై ఢిల్లీలో రూ.62,950 పలికింది. అంతకుముందు ఇది రూ.61,820గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల కొనుగోలుదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో వెండి ఏకంగా రెండు వేల రూపాయల కంటే అధికమైంది. కిలో వెండి ధర రూ.2,350 ఎగబాకి రూ.77, 400 పలికింది. అటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,000 అందుకొని రూ.56,650 నుంచి రూ.57,650 కి చేరుకోగా, 24 క్యారెట్ల ధర రూ.1,090 పెరిగి రూ.62,890 పలికింది. అలాగే కిలో వెండి రూ.2,500 అందుకొని రూ.79,500కి చేరింది. అంతర్జాతీయ మార్కె ట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,032 డాలర్లకి, వెండి 24 డాలర్లు పలికింది. క్రమంగా వడ్డీరేట్లను పెంచుకుంటూ పోయినా అమెరికా ఫెడరల్ రిజర్వు వచ్చే ఏడాది వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయని సంకేతాలు వల్లనే ధరలు పెరిగాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

### డోజోన్స్ సస్టెయిన్‌బిలిటీ వరల్డ్ ఇండెక్స్‌లో రెడ్డీస్

హైదరాబాద్, డిసెంబర్ 14: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్‌కు తాజాగా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. స్టాండర్డ్ అండ్ పూర్ డోజోన్స్ సస్టెయిన్‌బిలిటీ వరల్డ్ ఇండెక్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈ ఇండెక్స్‌లో చేరిన తొలి భారత్ ఫార్మా కంపెనీ ఇదే. అలాగే గ్లోబల్ సస్టెయిన్‌బిలిటీ రేటింగ్ ఏజెన్సీ ఎకోవాడిస్ డాక్టర్ రెడ్డీస్‌కు 'గోల్డ్ మెడల్' హోదాను ప్రదానం చేసింది. తాము ఎన్విరాన్‌మెంట్ సోషల్ గవర్నెన్స్ (ఈఎస్‌జీ) అజెండాలో సాధిస్తున్న ప్రగతితో వరుస అంతర్జాతీయ గుర్తింపులు లభిస్తున్నాయని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ కో-చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ తెలిపారు.



## వడ్డీరేట్లకు ఫెడ్ కట్

### వచ్చే ఏడాది 3-4సార్లు తగ్గింపులుంటాయంటూ సంకేతాలు




న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్ని శాసించే అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై సంచలన సంకేతాల్ని అందించింది. 2024లో 3-4 దఫాలు వడ్డీ రేట్ల తగ్గింపులు ఉంటాయంటూ సంకేతాలిచ్చింది. తాజా డిసెంబర్ పాలసీ సమీక్ష అనంతరం కీలక ఫెడ్ ఫండ్ రేట్లను 5.25-5.50 శాతం వద్ద యథాతథంగా అట్టిపెట్టింది.ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మీడియాతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణం తమ అంచనాలకంటే వేగంగా దిగివచ్చిందని, రేట్ల పెంపు ఇక అవసరం లేదని ఫెడ్ కమిటీ భావిస్తున్నదని చెప్పారు. రెండేండ్లుగా ఫెడ్ జీరో శాతం నుంచి 5.25 శాతానికి వడ్డీరేట్లను పెంచుతూ పోయింది. ఇందుకు అనుగుణంగా భారత్‌లో రిజర్వ్‌బ్యాంక్‌తో సహా పలు ప్రపంచ ప్రధాన కేంద్ర బ్యాంక్‌లు ఫెడ్ బాటనే అనుసరించాయి. ఫెడ్ వైఖరి మారడంతో రిజర్వ్ బ్యాంక్ రేపో రేటును కొత్త ఏడాదిలో తగ్గించవచ్చని విశ్లేషకులు అంచనాల్ని వెల్లడించారు.

**2024 మార్చిలో తొలి తగ్గింపు**

19 మంది సభ్యులుగల ఫెడ్ కమిటీలో మెజారిటీ సభ్యులు వచ్చే ఏడాది పావు శాతం చొప్పున మూడు కోతలు (0.75 శాతం) ఉంటాయని అంచనా వేశారు. మరికొంత మంది 4 కోతల్ని సూచించారు. దీంతో 2024లో 4.6 శాతానికి, 2025లో 3.6 శాతానికి ఫెడ్ రేటు తగ్గుతుందన్న అంచనాలు మార్కెట్లో నెలకొన్నాయి. 2024 మార్చి పాలసీ సమీక్షలో తొలుత 0.25 శాతం తగ్గింపు ఉంటుందని అంచనా. తాజా ఫెడ్ ప్రకటన అనంతరం ఈక్విటీలు, బాండ్లు, బంగారం కలిసికట్టుగా ప్రపంచవ్యాప్తంగా పెద్ద ర్యాలీ జరిపాయి.

### వోల్వో కార్లు ప్రియం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: వోల్వో కార్ ఇండియా కూడా ధరలను పెంచబోతున్నది. నూతన సంవత్సరం తొలి రోజు నుంచే అన్ని మాడళ్ల ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు తాజాగా వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం, విదేశీ మారకం రేట్లలో మార్పుల కారణంగా సంస్థపై పడుతున్న భారాన్ని స్వల్పంగా తగ్గించుకునే ఉద్దేశంలో భాగంగా వాహన ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ ఎండీ జ్యోతి మల్హోత్రా తెలిపారు.

### ఫ్రెష్ బస్ 100 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, డిసెంబర్ 14: రవాణా సదుపాయాల సంస్థ ఫ్రెష్ బస్ తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుతం 20 బస్సులతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో సేవలు అందిస్తున్న సంస్థ..2025 చివరినాటికి ఈ బస్సుల సంఖ్యను 170కి పెంచుకోనున్నట్టు కంపెనీ ఫౌండర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం రూ.100 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నిధులను ఇన్వెస్టర్ల నుంచి సేకరించనున్నది. ప్రస్తుతం ఒలెక్ట్రా బస్సులను లీజుకు తీసుకొని రవాణా సేవలు అందిస్తున్నది.

### పన్ను వసూళ్లు 10.64 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్య కేంద్ర ప్రభుత్వ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.10.64 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే ఇవి 23.4 శాతం అధికం. పూర్తి సంవత్సరానికి బడ్జెట్లో ప్రతిపాదించిన అంచనాల్లో ఈ 8 నెలల్లో వసూళ్లు 58.34 శాతంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో రిఫండ్స్ జరపకముందు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 17.7 శాతం వృద్ధితో రూ.12.67 కోట్లకు చేరగా, రూ.2.03 లక్షల కోట్ల పన్ను రిఫండ్స్ చేసినట్టు వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.18.23 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు (వ్యక్తిగత ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్ను), రూ.15.38 లక్షల కోట్ల పరోక్ష పన్ను వసూళ్లను (జీఎస్టీ, కస్టమ్స్, ఎక్సైజ్) బడ్జెట్‌లో అంచనా వేశారు. మొత్తం రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యానికే ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక శాఖ అధికారి తెలిపారు.

## రియల్టీ రయ్..రయ్

### ఈ ఏడాది రూ.4.5 లక్షల కోట్ల ఇండ్ల అమ్మకాలు

### హైదరాబాద్‌సహా దేశంలోని ఏడు నగరాల మార్కెట్‌పై అనరాక్ అంచనా



న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఈ ఏడాది ఇండ్ల అమ్మకాలు గత ఏడాదితో పోల్చితే 38 శాతం పెరిగే వీలుందని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తెలిపింది. హైదరాబాద్‌సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల రియల్టీ మార్కెట్‌పై అనరాక్ తాజాగా తమ అంచనాల్ని వెలిబుచ్చింది. ఈ క్రమంలోనే హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై-ఎంఆర్, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె నగరాల్లో గత ఏడాది రూ. 3,26,877 కోట్ల హౌజింగ్ సేల్స్ జరిగాయని, ఈ ఏడాది మాత్రం ఈ నగరాల్లో రూ.4.5 లక్షల కోట్లకు విక్రయాలు పెరుగవచ్చన్నది. ఇప్పటికే ఈ సంవత్సరం జనవరి-సెప్టెంబర్ మధ్య రూ.3,48,776 కోట్ల విలువైన ఇండ్ల అమ్మకాలు జరిగాయని పేర్కొన్నది. 2022తో చూస్తే 7 శాతం ఎక్కువన్నది. దీంతో నిరుడు సేల్స్‌ను ఇప్పటికే అధిగమించి రియల్ ఎస్టేట్ మార్కెట్ పరుగులు పెడుతున్నదని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలోనే ఈ నెలాఖరుతో ముగిసే మూడు నెలల్లో మరో లక్ష కోట్ల రూపాయల హౌజింగ్ సేల్స్‌కు ఆస్కారముందన్న అభిప్రాయాన్ని అనరాక్ వ్యక్తం చేసింది.

**హైదరాబాద్‌లో 43 శాతం**

ఈ జనవరి-సెప్టెంబర్‌లో నిరుడుతో పోల్చితే హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు 43 శాతం పెరిగినట్టు అనరాక్ తెలియజేసింది. విలువ రూ.25,001 కోట్ల నుంచి రూ.35,802 కోట్లకు ఎగిసింది. కాగా, పుణెలో అత్యధికంగా 96 శాతం వృద్ధి నమోదైంది. చెన్నైలో 45 శాతం, బెంగళూరులో 42 శాతం, ముంబై-ఎంఆర్‌లో 41 శాతం, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం, కోల్‌కతాలో 19 శాతం పెరిగాయి.

ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల్లో జరిగిన ఇండ్ల అమ్మకాలు.. గత ఏడాది మొత్తంగా నమోదైన హౌజింగ్ సేల్స్‌ను మించిపోయాయి. దీన్నిబట్టి ఇండ్లకు డిమాండ్ పెద్ద ఎత్తున ఉందన్నది అర్థమవుతున్నది. ముఖ్యంగా ప్రీమియం లగ్జరీ నివాసాలకూ ఆదరణ పెరగడం గమనార్హం. ఇదే సమయంలో దేశంలోని టాప్-7 నగరాల్లో ధరలు సగటున 8-18 శాతం పెరిగాయి. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.1,12,976 కోట్ల సేల్స్ ఉన్నాయి. అయితే రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 1 శాతం పెరిగితే, మూడో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఏకంగా 8 శాతం వృద్ధి కనిపించింది. చివరి త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్) పండుగ సీజన్ కావడంతో అమ్మకాలు మరింతగా ఉంటాయనే అంచనా. కాబట్టే ఈ ఏడాది రూ.4.5 లక్షల కోట్ల హౌజింగ్ సేల్స్‌కు వీలుందనిపిస్తున్నది.

*-అనుజ్ పురి అనరాక్ గ్రూప్ చైర్మన్*



## 8 నెలల గరిష్ఠానికి టోకు ధరల సూచీ

### నవంబర్‌లో 0.26 శాతంగా నమోదు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: గత కొన్ని నెలలుగా ప్రతికూలంగా ఉన్న టోకు ధరల సూచీ మళ్లీ పుంజుకున్నది. కూరగాయలు, ఉల్లిగడ్డ ధరలు భారీగా పెరగడంతో నవంబర్ నెలకుగాను టోకు ధరల సూచీ ఎనిమిది నెలల గరిష్ఠ స్థాయి 0.26 శాతానికి తాకింది. ఈ ఏడాది మార్చి నెలలో 1.41 శాతంగా నమోదైంది. ఆహార పదార్థాలతోపాటు మినరల్స్, యంత్రాల పరికరాలు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్, ఆప్టికల్ ఉత్పత్తులు, వాహనాలు, ఇతర రవాణాకు సంబంధించిన పరికరాల ఉత్పత్తుల ధరలు పెరగడం వల్లనే టోకు ధరల సూచీ భారీగా పెరిగిందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గత నెలలో ఆహార ద్రవ్యోల్బణం 8.18 శాతానికి ఎగబాకగా, అక్టోబర్‌లో ఇది 2.53 శాతంగా ఉన్నది. మరి ముఖ్యంగా ఉల్లిగడ్డ ధరలు 101 శాతం పెరగడం ఇందుకు కారణమని విశ్లేషించింది. ఉల్లి ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన ఉల్లి ధర రూ.80 నుంచి రూ.40కి దిగొచ్చాయి. అలాగే అక్టోబర్‌లో మైనస్ 21 శాతంగా ఉన్న కూరగాయల ధరల సూచీ గత నెలలో 10.44 శాతానికి చేరుకున్నది. వీటితోపాటు వరి, పండ్ల ధరల సూచీ 10.44 శాతం, 8.37 శాతంగా నమోదైంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.